క్లుప్తంగా

తొలి ఏకాదశికి ఆలయాల ముస్తాబు


రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి

కాకినాడ రూరల్: ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి సందర్భంగా భక్తుల దర్శనాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. కాకినాడ రూరల్ సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో, సర్పవరం జంక్షన్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కోసం ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు 'మీ కోసం' స్వచ్ఛంద సంస్థ మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి పిల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదలు, ఆపదలో ఉన్న వారికి కొంద మంది యువకులతో నెల వారి వేతనంలో కొద్ది మొత్తం కేటాయించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టరు అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలి


కొమరగిరి లే అవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

బోట్‌క్లబ్: కొమరిగిరి లే అవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులు వీలైనంత త్వరగా గృహ నిర్మాణాలు ప్రారంభించాలని గృహ నిర్మాణశాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం కాకినాడ నగరంలోని వివిధ డివిజన్‌ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. స్థలాలు పొందిన వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులు తమ వాట డబ్బులు చూసుకొని ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాల వద్ద మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గృహ నిర్మాణశాఖ ఈఈ వై.శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమాజానికి రోటరీ సేవలు అవసరం


శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: సమాజ అవసరాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రోటరీ సంస్థకు మంచి గుర్తింపు వస్తుందని రోటరీ మాజీ గవర్నర్ ఎల్.సత్యనారాయణ (టిక్కు) అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కార్యదర్శిగా దామెర శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్థానిక కాస్మోపాలిటిన్ క్లబ్‌లో మంగళవారం ఆయన మిత్ర బృందం సత్కరించారు. ఈ సందర్భంగ టిక్కు మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణతో పాటు మొక్కలను నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టాలిసిందిగా కోరారు. కార్యక్రమంలో యార్లగడ్డ వీర్రాజుతో పాటు పలువురు మిత్రులు పాల్గొని అభినందనలు తెలిపారు.

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బుచ్చిరెడ్డి


రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి

కాకినాడ: రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షునిగా నల్లమిల్లి బుచ్చిరెడ్డి, కార్యదర్శిగా ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి రెండోసారి ఎన్నికయ్యారు. కోశాధికారిగా తాడి ఆదిరెడ్డి, రెడ్డి సంఘ భవన నిర్మాణ సాధన కమిటీ చైర్మన్ నల్లమిల్లి మాచారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షునిగా నల్లమిల్లి సత్తిరెడ్డి, ప్రధాన ఉపాధ్యక్షుడిగా మల్లిడి అబ్బారెడ్డి, సిటీ ఉపాధ్యక్షునిగా కర్రి బుచ్చిరెడ్డి ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఉపాధే పరమావధి..

- సత్ఫలితాలు ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చర్యలు
- ఐటీఐలో నూరు శాతం అడ్మిషన్లు
- రూ.2.76 కోట్లతో సాంకేతిక పరికరాల ఆధునీకరణ



బాలాజీచెరువు: విద్యారంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉండే సాంకేతిక విద్యాభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఇంతవరకు ఏవో నచ్చిన కోర్సుల్లో చేరడం తరువాత ఏదో ఒక ఉపాధిని వెతుక్కుంటూ వెళ్లిపోవడం జరిగేది. నేటి పరిస్థితి అలా లేదు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులను అప్రెంటిస్‌గా తీసుకునేలా.. ఆయా సంస్థల్లో డిమాండ్ ఉన్న సాంకేతిక విద్యను అభ్యసించేలా విద్యార్థులకు అవగాహన కల్పించి తదనుగుణంగా ఉపాధికి మార్గాలు సుగమం చేశారు. ఆ చర్యల ఫలితంగా స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ ఏడాది వంద సీట్లు భర్తీ అయ్యాయి. ఈ కళాశాలలో అడ్మిషన్లకు మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహించి అన్ని కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. గత మూడేళ్ల కాలంలో 10 శాతం సీట్లు ఖాళీలు ఉండగా ఈ ఏడాది మాత్రం పూర్తిగా భర్తీ అయ్యాయి. ఇందుకు కారణం లేకపోలేదు. దానికి గల కారణం ఐటీఐలో ఆధునిక బోధనకు ఈ ఏడాది నుంచి చర్యలు తీసుకుంటున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు వేల కొద్దీ హాజరవుతున్నా కేవలం పదుల సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలు సాధిస్తున్నారని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ స్వయంగా ప్రకటించింది. ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్ పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ హబ్‌ల వంటివి ఏర్పాటు చేయడంతో పాటు ఐటీఐ కళాశాల అభివృద్ధికి నిధులు విడుదల చేశాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా నిధులు లేక నిర్వీర్యంగా ఉన్న ఈ కళాశాల ప్రస్తుత విద్యాబోధనకు అవసరమైన కొత్త పరికరాలు కొనుగోలుచేసి విద్యార్థులను అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఎప్పటి నుంచో ఉన్న పాత ప్రాక్టికల్ పరికరాలు స్థానంలో కొత్తవి కనుగోలు చేస్తున్నారు.

పదో తరగతి పూర్తి చేసిన తరువాత రెండేళ్ల కోర్సు చేస్తే పక్కా ఉపాధి కల్పించే దిశగా నేడు ప్రాచుర్యం పొందిన కోర్సు ఐటీఐ. పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతకు ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ) కోర్సులు ఉపాధి మార్గాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పలు ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఈ కోర్సులు దోహదపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విద్యాసంస్థ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థి ఉద్యోగం, ఉపాధి పొందడమే లక్ష్యంగా సాంకేతిక విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. కాకినాడ ఐటీఐలో అన్ని విభాగాల్లో కలిపి 1080 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

కాకినాడ ఐటీఐలో కోర్సులు ఇవే..

ఐటీఐ కళాశాలల్లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, టర్నర్, డీజిల్, మెకానికల్, వెల్డర్, డ్రాఫ్ట్‌సమెన్(సివిల్), కోపా, ఆర్‌అండ్‌ఏసీ, ట్రేడులు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో అభ్యర్థులు చేరితే శిక్షణ ముగిసాక ఏడాది పాటు అప్రంటీస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. డీజిల్ మెకానిక్, కోపా, వెల్డర్, ప్లంబర్ తదితర కోర్సులు ఏడాది కాలం కాగా, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సులు రెండేళ్ల వ్యవధి కలిగినవి. అలాగే ఐటీఐ రెండేళ్లు పూర్తిచేసిన వారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరడానికి అవకాశం ఉంటుంది.

వంద శాతం సీట్ల భర్తీ..



కాకినాడ ఐటీఐకు రూ.2.76 కోట్లు విడుదల చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2.47 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.29 లక్షలు. ఇప్పటికే మొదటి దశలో భాగంగా రూ.96 లక్షలు ఖాతాలో జమ చేశారు. మోటర్ మెకానిక్ విభాగానికి సంబంధించి ఆధునీక పరికరాలు కోనుగోలు చేస్తాము. రెండో దశలో ఎలక్ట్రానిక్స్, డ్రాఫ్ట్‌సమెన్ సివిల్, డీజిల్ మెకానిక్ విభాగాలు ఆధునీకరిస్తాం.

– ఎం.వేణుగోపాల వర్మ, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

హరిశ్చంద్ర నాటకాలపై 21న పుస్తకావిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూరిబాబు రాజు తదితరులు

పెద్దాపురం: ఈ నెల 21వ తేదీన 'హరిశ్చంద్ర నాటకాలు–తులనాత్మక పరిశీలన' తెలుగు పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. సాహితీ స్రవంతి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు రచించిన పుస్తకావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు రచనలు చాలా ఆదర్శప్రాయంగా, విప్లవాత్మకంగా ఉంటాయని సూరిబాబు రాజు అన్నారు. ఆయన వెలువరించిన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథావిష్కరణ సభకు కవులు, రచయితలు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొత్త శివ, కూనిరెడ్డి అరుణ, ఉదయ్, చర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లూటీకుమార్ సేవలు చిరస్మరణీయం


ఆశ్రమాలలో నిత్యావసరాలకు నగదు అందజేస్తున్న నాయకులు

కాకినాడ: వైఎస్సార్ సీపీ నగర మాజీ అధ్యక్షులు దివంగత రాగిరెడ్డి వెంకట్ జయ రాంకుమార్ (ఫ్లూటీ కుమార్) జయంతి వేడుకలను కాకినాడలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దిగుమర్తి వారి వీధిలో లక్ష్మీ గణపతి ఆలయం వద్ద వృద్ధులకు వస్త్ర దానం చేశారు. జగన్నాథపురం చర్చి స్క్వేర్ సెంటర్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ అనాథాశ్రమం వద్ద కేక్ కట్ చేసి, బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు. శారదాదేవి గుడి వద్ద మానవీయ ఫౌండేషన్‌లో వృద్ధులకు బిస్కెట్లు, రస్కులతో పాటు నిత్యవసరాలకు సరిపడా నగదు అందజేశారు. కల్పనా సెంటర్‌లో బులుసు సాంబమూర్తి వికలాంగుల పాఠశాలలో, కాకినాడ జీజీహెచ్‌లో సుమారు 800 మందికి భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, మాజీ కార్పొరేటర్లు రాగిరెడ్డి బన్ని, పెనపోతు సత్తిబాబు, మాకినీడి శేష కుమారి నల్లబెల్లి సుజాత, రాగిరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు ఉషా జ్యోతి, రాగిరెడ్డి హనీ, రాగిరెడ్డి ఆది మణిరాజ్, గ్రంధి రాజా, పేర్ల రజిని, రామలింగం, రఫీ, రాజనాల విజయ సారథి, బషీర్, చక్రవర్తి, సిడి కుమార్, ఎడ్లపల్లి రమేష్, కర్రి సుబ్బారావు, కర్రి అనంత నాగు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లూటీ కుమార్‌కు ఘనంగా నివాళి

వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి దివంగత రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ (ఫ్లూటీ కుమార్) చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కుమార్ 49వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, ద్వారంపూడి చారిటబుల్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి డీకే రెడ్డి, నాయకులు మాకినీడి శేషకుమార్, నల్లబెల్లి సుజాత, మేరి పాల్గొన్నారు.

సత్యదేవుని వ్రతాలకు మారేడు పత్రి

- వేసవిలో లభించని మారేడు
- రెండు నెలలుగా జమ్మి పత్రితో వ్రతాల నిర్వహణ
- వర్షాలకు చిగురించిన చెట్లు, దేవస్థానానికి చేరుకున్న పత్రి


ఐషర్ వ్యాన్‌లో రత్నగిరికి తీసుకువచ్చిన మారేడు పత్రి

అన్నవరం: సత్యదేవుని వ్రతాలలో మారేడు పత్రి వినియోగిస్తున్నారు. వేసవి ఎండలకు మారేడు చెట్లు ఎండిపోవడంతో పత్రి కొరత ఏర్పడింది. దీంతో గత రెండు నెలలుగా మారేడు పత్రికి బదులు జమ్మి పత్రితో సత్యదేవుని వ్రతాలను నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మారేడు చెట్లు చిగిరించాయి. మళ్లీ వాటిని సేకరించి సత్యదేవుని వ్రతాలలో ఉపయోగిస్తున్నట్టు దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

సత్యదేవుని వ్రతాలకు అవసరమైన మారేడు పత్రిని విశాఖ, అల్లూరి జిల్లా మన్యం నుంచి సేకరిస్తారు. ఆ మన్యంలో విస్తారంగా ఉన్న మారేడు చెట్ల నుంచి వారానికి రెండు, మూడు సార్లు వెళ్లి అక్కడ చెట్ల నుంచి సేకరించి వాహనాల ద్వారా దేవస్థానానికి తీసుకువచ్చి కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచి ఉపయోగిస్తారు. మారేడు పత్రి కొరత సమయంలో రాజానగరం తదితర ప్రాంతాల నుంచి జమ్మి పత్రి సేకరించి దేవస్థానానికి తరలించి కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచి వ్రతాలలో ఉపయోగిస్తారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచండి

- కమిషనర్ వెంకటరావు
- ఆయా స్థలాల యజమానులకు నగరపాలక సంస్థ నోటీసులు
- పూడిక తీత పనుల పరిశీలన


పూడికతీత పనులు, పారిశుద్ధ్య పనులపై సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: అపరిశుభ్రతకు, దోమల తీవ్రతకు కారణమవుతున్న ఖాళీ స్థలాల్లో నిలవ నీటిని వెంటనే తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు స్థల యజమానులను కోరారు. ఇందుకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలోని సుమారు 160 మంది స్థల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. మంగళవారం ఆయన కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. అక్కడి పనులు ప్రగతిని పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం జగన్నాథపురం రణదీప్‌నగర్ ప్రాంతంలోని మేజర్ డ్రైన్‌ను పరిశీలించారు. అక్కడ గుర్రపుడెక్క పేరుకు పోవడానికి గుర్తించారు. తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న తూరంగి గ్రామ పరిధిలోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలవ ఉండడాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి పరిశుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాలను నిరుపయోగంగా, నిర్లక్ష్యంగా వదిలి పెట్టడం వల్ల పిచ్చి మొక్కలు పెరిగి, డంపింగ్ యార్డుల్లా తయారై, దోమలు పెరిగి ప్రజారోగ్యానికి భంగకరంగా మారుతున్నాయన్నారు. ఈ విషయమై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే పూడిక తీత పనులు పూర్తయిన అనంతరం అక్కడి వ్యర్థాలను కూడా తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

15 నుంచి అన్న క్యాంటీన్ల ప్రారంభం

వచ్చేనెల 15 నుంచి ఐదు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు కమిషనర్ వెంకటరావు చెప్పారు. మంగళవారం ఆయన ఎస్ఈ పి.సత్యకుమారి ఇతర అధికారులతో కలిసి క్యాంటీన్లకు ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలించారు. జగన్నాథపురం, అన్నమ్మగాటి, సంతచెరువు, వివేకానంద పార్క్, డైరీఫారం సెంటర్ బోట్‌క్లబ్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే వాటి నిర్వహణకు టెండర్లు పిలిచామని, గురువారం నాటికి ఖరారు చేస్తామని తెలిపారు. కమిషనర్ వెంట స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, ఏఈ రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

21లోగా ఫ్లెక్సీలు తొలగించాలి : కమిషనర్

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు భానుగుడి పద్మప్రియ జంక్షన్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డుగా నిర్ణయించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. గతంలో భానుగుడి నుంచి కలెక్టరేట్ సమీపంలోని ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్‌గా ప్రకటించి ఆచరణలో అమలులోకి తీసుకు వచ్చామని తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు గడువు విధించి అమలు చేశామన్నారు. తొలి విడత విజయవంతం కావడంతో రెండో విడత సంస్కరణలలో భాగంగా ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే పద్మప్రియ సెంటర్ నుంచి ఓవర్ బ్రిడ్జి, టూ టౌన్ పోలీస్ స్టేషన్, అపోలో హాస్పిటల్ మీదుగా సూపర్ బజార్, గ్లాస్ హౌస్, గోల్డ్ మార్కెట్ సెంటర్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్‌గా నిర్ణయించామన్నారు. వాహన చోదకులు, పాదచారుల సౌకర్యార్థం తీసుకున్న ఈ నిర్ణయానికి అనుగుణంగా నిర్దేశించిన ఫ్లెక్సీ ఫ్రీ రోడ్ ప్రాంతంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను 21వ తేదీ ఆదివారం లోపుగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఈ నెల 22వ తేదీ నుంచి నగరపాలక సంస్థ తరపున అనుమతి లేని బ్యానర్లు, హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగించి అందుకు అయ్యే ఖర్చును సంబంధిత వర్గాల నుంచి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. నగర సుందరీకరణ కోసం తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధిత వర్గాలన్నీ సహకరించాలని కమిషనర్ కోరారు.

నేడు వెంకన్నకు ప్రత్యేక పూజలు

యానాం: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి బుధవారం ఉదయం పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ లలిత మహిళా మండలి సభ్యులచే విష్ణు సహస్ర నామ పారాయణ జరుగుతుందన్నారు.

నేడు మరిడమ్మతల్లి జాతర



ఎస్.అన్నవరంలో ఉన్న మరిడమ్మ ఆలయం

తుని రూరల్: ఎస్.అన్నవరం లక్ష్మీదేవి చెరువు వద్ద ఉన్న మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. బుధవారం రాత్రి ఆరు గంటల నుంచి గురువారం ఉదయం వరకూ జాతర మహోత్సం, 18న ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తీర్థం నిర్వహించి, అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. జాతర, తీర్థాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయనున్నట్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పోలరాతి చక్రరావు, కీర్తి నాగేశ్వరరావు, కోశాధికారి మోకిన సురేష్ తెలిపారు.

రహదారులు బాగుచేయరూ..

- అధ్వానంగా యండమూరు–జి.భావారం రహదారి
- ప్రమాదాలపాలవుతున్న వాహన చోదకులు
- పునర్నిర్మించాలని ప్రజల వినతి


యండమూరు–పెద్దాపురప్పాడు గ్రామాల మధ్య పాడైన రహదారి


జి.భావారం–యండమూరు గ్రామాల మధ్య పరిస్థితి

కరప: రహదారులు ధ్వంసమవ్వడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడుగడుగునా గోతులపడ్డ యండమూరు – జి.భావారం రహదారిపై ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని ద్విచక్రవాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరప, కాజులూరు మండలాలను అనుసంధానం చేసే రహదారి మరీ దారుణంగా తయారైందని రెండు మండలాల ప్రజలు అధికారుల తీరును దుయ్యబడుతున్నారు. మండల పరిధిలోని పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, యండమూరు గ్రామస్తులు మండల కేంద్రానికి రావాలంటే ఈ రోడ్డుపైనే ప్రయాణాలు సాగిస్తుంటారు. వేళంగి, సిరిపురం, జి.భావారం గ్రామస్తులు ద్రాక్షారామ, కోటిపల్లి వంటి పుణ్య క్షేత్రాలకు, కాజులూరు మండలం వెళ్లాలంటే జి.భావారం–యండమూరు రహదారి పైనే రాకపోకలు సాగిస్తుంటారు. యండమూరు – జి.భావారం రహదారి చిన్నాభిన్నమైంది. ఈ రహదారిపై అనునిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. అలాగే కాజులూరు మండల వాసులు కరప మండలానికి రావాలన్నా ఈ రహదారి పైనే రాకపోకలు సాగిస్తుంటారు. యండమూరులోని అతి పురాతన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి రెండు మండలాల ప్రజలు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగించి, స్వామి వారికి పూజలు చేస్తుంటారు. యండమూరు –జి.భావారం రోడ్డును చాలా కాలం క్రితం నిర్మించడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గోతులు పడ్డ రహదారిపై వెళ్లి వస్తుంటే సైకిళ్లు మరమ్మతుకు గురవుతున్నాయని, వ్యవసాయ కూలీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జి.భావారం నుంచి రహదారి పొడవునా పెద్ద గోతులు పడ్డాయి. ద్విచక్రవాహన చోదకులు గోతుల్లో పడి అదుపుతప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయంలో అయితే గోతులు కనపడక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు గ్రామస్తులు అంటున్నారు. గోతులు పూడ్చించేందుకు కూడా చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అడుగడుగునా గోతులు పడటంతో సైకిళ్లపై వెళ్లేవారు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి యండమూరు – జి.భావారం రహదారిని వేయించేందుకు చర్యలు తీసుకోవాలని, అంత వరకూ గోతులకు ప్యాచ్ వర్కులయినా చేయించాలని మండల వాసులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



జి.భావారం, యండమూరు రహదారి అడుగడుగునా గోతులుపడి ప్రమాదభరితంగా తయారైంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి.

రొక్కాల తారకేష్, జి.భావారం

కౌమారదశలో ఆకర్షణలకు గురికావొద్దు


కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

తుని రూరల్: కౌమారదశలో కలిగే ఆకర్షణలకు గురికాకుండ బాలికలు పరిపూర్ణ జ్ఞానంతో నడుచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి అన్నారు. మంగళవారం తుని మండలం వి.కొత్తూరులోగల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. వివిధ విభాగాలను తనిఖీ చేసిన ఆమె విద్యార్థినులతో సమావేశమయ్యారు. లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిలు అలవర్చుకోవాలని బాలికలకు సూచించారు. సమాజంలో ఏవిధంగా నుచుకోవాలో వివరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలను అవగాహనతతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌమారదశను సమర్థవంతంగా దాటాలంటూ విద్యార్థినులచే విక్టరీ చూపిస్తూ పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ అమృతవాణి పాల్గొన్నారు.